
హైదరాబాద్ వార్త


# ఉస్మానియాలో అరుదైన శస్త్ర చికిత్స

## రోగికి విజయవంతంగా కాలేయ మార్పిడిచేసిన వైద్యులు


కోలుకున్న లివర్ పేషంట్‌తో ఉస్మానియా ఆసుపత్రి వైద్యం బృందం

**అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 6(ప్రభాతవార్త):** కాలేయ వ్యాధితో భాదపడుతున్న ఓ రోగికి ఆధునాతమైన శస్త్ర చికిత్స చేసి ఉస్మానియాఆసుపత్రి వైద్యులు తమకు ఎవరు సాటిలేరని మరోసారి నిరూపించుకున్నారు. బుధవారం ఉస్మానియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆసుపత్రి వైద్యులు మధుసూధన్, పాండునాయక్‌తో కలిసి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా చేర్యాల మండలానికి చెందిన మల్లయ్య కుమారుడు పెద్దింటి మురళీ(38), కాలేయ వైఫల్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి వచ్చాడు. మురళీకి వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి ఆసుపత్రిలో చేర్చుకున్నారు. అయితే మురళీకి కాలేయ మార్పిడి అవసరమైంది. గాంధీ ఆసుప త్రిలో చికిత్స పొందుతున్న ఓ రోగి బ్రెయిన్‌డెడ్ కాగా, ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు అతడి నుంచి ఆగస్టు 20వ తేదీన కాలేయాన్ని తీసి మురళీకి శ్రస్తచికిత్స ద్వారా అమర్చారు.ప్రస్తుతం అతను కోలుకోవడంతో ఉస్మానియా వైద్యులు డిశ్చార్జ్ చేశారు.ఇటీవల ఏర్పాటు చేసిన కొత్త అల్ట్రా మోడ్రన్ ఆపరేషన్ థియేటర్‌లో ఇది 2వ విజయ వంతమైన కాలేయ మారి ్పడి శ్రస్త చికిత్స అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు, వైద్యసంచాలకులు డాక్టర్ రమేష్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైద్యులు పాల్గొన్నారు.

# 'జి-20' సమావేశంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా తీర్మానం చేయాలి

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బోస్

**సైఫాబాద్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** ఈ నెల 9వ తేదీ నుంచి న్యూఢిల్లీలో జరగనున్న జి-20 దేశాల సమావేశాల్లో చారిత్రత్మకమైన నిర్ణయాలను తీసుకోగలరని అశిస్తున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ అశాభావం వ్యక్తం చేశారు. తీసుకోబోయే చారిత్రాత్మక నిర్ణయాల్లో మతోన్మాదం ప్రధానమైన సమస్యని మతోన్మాదం అన్ని సమాజాల్లో మనుషలను విభజించేందుకు, ప్రజల మధ్య ద్వేషాన్ని నింపేందుకు పనిచేస్తుందని, దీని మూలంగా సమాజంలో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఆనేక సందర్భాల్లో మతోన్మాదం సమాజాభివృద్ధికి నిరోధకంగా తయారవుతున్నదని, సైన్స్ సాధిస్తున్న అభివృద్ధికి అటంకాలుసృష్టిస్తున్నదని, మానవత్వాన్ని మంటకలుపుతున్నదని, ఈ మతోన్మాద ప్రమాదం అభివృద్ధి చెందిన దేశాలతోపాటు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సమస్యలు సృష్టిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన కొన్ని దేశాల్లో జాతివివక్ష పేరుమీద, మరికొన్ని దేశాలలో మతం పేరుమీద ప్రజల మధ్య విభేదాలు సృష్టించబడుతున్నాయన్నారు. ఏ దేశంలోనైనా ఉగ్రవాదం, మతోన్మాదం అన్న దమ్ములు వంటివని ఇది ఆర్థిక దోపిడీదారులు సృష్టిని అభిప్రాయం వ్యక్తం చేశారు. అందువల్ల ఈ సమావేశంలో ఏ దేశం కూడా ఉగ్రవాదాన్ని, మతోన్మాదాన్ని ప్రోత్సహించరాదని, వీలైనంతమేరకు అణిచివేయాలని ఇందుకోసం తగిన విధంగా తీర్మానాలు చేయాలని జి-20 సమావేశా లకు వి.ఎస్.బోస్ విజ్ఞప్తి చేశారు.

# గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగంగా పూర్తిచేయాలి

## ఎమ్మెల్యేలు, అధికారులకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశం


ఎమ్మెల్యేలు,అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు తలసాని, మహమూద్‌అలీ

**హైదరాబాద్, సెప్టెంబరు 6,ప్రభాతవార్త:** గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో హోంమంత్రి మహమూద్ అలీలో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గ పరిధిలో 3 వేలమందికి 3 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం సంపిణీ, వచ్చిన దరఖాస్తులపై సమగ్ర విచారణ జరిపి అర్హులను గుర్తించాలన్నారు. ఇందుకు నియోజకవర్గ ఎమ్మెల్యేలతో స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు చర్చించి ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా దరఖాస్తు దారుల ఓటర్‌ఐడి, రేషన్‌కార్డు,కరెంట్‌బిల్లు ప్రమాణికంగా తీసుకోవాలన్నారు. జిల్లాలో పేదల ఇంటి నిర్మాణానికి చేయూత నందించాలనేది ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలోచన, పేదల సొంతింటి కలను నేరవేర్చిన ఘనత కూడా తెలంగాణ ప్రభుత్వం సిఎం కెసిఆర్‌దేనన్నారు. ప్రభుత్వ ఉన్నతమైన లక్ష్యాలకు అనుగుణంగా లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి మాట్లడుతూ ప్రతినియోజవకర్గంలో ఎంపిక కొరకు ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరిగిందని 45వేలమంది లబ్దిదారులను ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాగంటి గోపినాథ్, కాలేరు కాలేరు వెంకటేష్, హోజాంఖాన్, జాఫర్ హుస్సేన్, మిరాజ్, కౌసర్, ఎమ్మెల్సీ సురభివాణిదేవి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల హక్కుల సాధనకు పోరాడిన వ్యక్తి బైరు మల్లయ్య


బైరు మలయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చెరుపల్లి సీతారాములు, ఎం.వి.రమణ తదితరులు

**చిక్కడపల్లి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్రంలో కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషిచేసిన గొప్పనాయకుడు బైరు మల్లయ్య అని వక్తలు కీర్తించారు. బుధవారం బాగ్‌లింగం పల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలోని తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రంలో బైరు మలయ్య వర్ధంతి సభ టిపిఎస్‌కె అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. గీత కార్మికులతో పాటు సమస్త శ్రమజీవుల హక్కుల కోసం మల్లయ్య పోరాటం చేశారని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న గొప్ప నాయకుడని, ఆయన ఆశయ సాధన కోసం నేడు కుల మతాలకతీతంగా శ్రామిక రాజ్యం స్థాపన కోసం పనిచేయాలన్నారు. కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకట రమణ మాట్లాడుతూ ఆనాడు దొరలకు, భూస్వాములకు అనుకూలంగా ఉన్న వవేలం పాటల విధానానికి వ్యతిరేకంగా గీత కార్మికులకు సొసైటీలు ఏర్పాటు చేయడంలో మల్లయ్య పాత్ర కీలకంగా ఉందన్నారు. మహిపూజ్ విధానం, నౌకర్ నామ రద్దు కోసం పోరాడి విజయం సాధించారన్నారు. రాజకీయ పార్టీలకతీతంగా వేలాది మంది గీత కార్మికులను సమీకరించి హక్కులకై పోరాడాడని, ఆయన స్ఫూర్తితో నేడు సంఘం పనిచేస్తుందన్నారు. వృత్తిలో ప్రమాదాలు పెరిగిపోయాయని, రెండు రోజులకు ఒకరు చనిపోతున్నారని, వీరిని కాపాడాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రమాద నివారణకు చర్యలు తీసుకుని సేఫ్టీ మోకులు ఇవ్వాలని, మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా గౌడ ఆత్మీయ సమ్మేళనంలో కెటిఆర్ ఇచ్చిన హామీలు అమలుచేయాలని అన్నారు. గీత కార్మికులకు బైకులు ఇస్తామన్న హామీ అమలు చేయాలని, గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్ మాట్లాడుతూ ఆరోజు కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ధర్మభిక్షం, ఎస్ఆర్ దాట్ల, దేశిని చిన్నమల్లయ్య, రాములు, తోట్ల మల్సూర్‌లతో పాటు బైరు మల్లయ్య కృషి ఎనలేనిది అని అన్నారు. వారి స్ఫూర్తితో నేడు పనిచేద్దామన్నారు. సమావేశంలో టిపిఎస్‌కె నాయకులు జి.రాములు, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మడి రాజు నరేశ్, పి.ఆశయ్య, కల్లు గీత కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. వెంకటనర్సయ్య, సీనియర్ నేతలు స్వాతంత్ర్య సమరయోధుడు అబ్బగాని బిక్షం, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు పి.రమేశ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.ధర్మనాయక్, ఆర్.శ్రీరామ్‌నాయక్, అనంతుల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# వట్టినాగులపల్లి బొడ్రాయి ఉత్సవాల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణ

## దళితులను పూజకు అనుమతించకుండా అడ్డుకున్నారని గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు

**గచ్చిబౌలి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త** నగర శివారు పరిధిలోని వట్టినాగుపల్లి గ్రామ బొడ్రాయి పండుగ ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. గ్రామంలోని ఇరువర్గాల మధ్య చోటు చేసుకున్న వివాదం కులాల మధ్య ఘర్షణకు దారి తీసింది. దళితులను పూజకు అనుమతించకుండా, బోనాలు సమర్పించకుండా ఇతర కులాల వారు అడ్డుకున్నారని వాపోతూ గ్రామ దళితులు గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేశారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వట్టినాగుపల్లి గ్రామంలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు బాధితుల కథనం ప్రకారం...

వట్టినాగులపల్లి గ్రామంలో గ్రామ దేవత, బొడ్రాయి పండుగను బుధవారం నిర్వహించారు. ఈ క్రమంలో బోనాలు సమర్పించే విషయంలో గ్రామ దళితులకు, ఇతర కులస్థుల మధ్య వివాదం చోటుచేసుకుంది. గ్రామ దళితులు బోనాలు సమర్పించవద్దని, పండుగలో పాల్గొనవద్దని కుల వివక్ష చూపించిన కొందరు తమపై దాడికి పాల్పడ్డారని దళితులు పోలీసులకు పిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన దళితులు బక్కని రాములు, దాసరి వినోద్,భ్యాగరి అభిలాష్, బి,సాయి, తేజ, అర్జున్, సుగుణ, అరుణ తదితరులు గ్రామంలో బొడ్రాయికి బోనాలు సమర్పించేందుకు వెళ్లగా, ఇతర కులాల వారు అడ్డుకున్నారని వాపోయారు. గ్రామానికి చెందిన ఇతర కులస్థులు కొండె సాయిలు, కిశోర్‌యాదవ్, పరమాళ్ల రంగం, కాకి శ్రీశైలం, భూపతి రాజు, గొల్ల సుధాకర్, గొల్ల కిరణ్, గొల్ల క్రిష్ణ, గడిల ప్రకాశ్‌సింగ్, గడిల నర్సింగ్, గడిల శంకర్, కుమ్మరి శేఖర్, ఎరుకల శ్రీకాంత్, రాగం భాను, కుమ్మరి గండయ్య, దేవేందర్ యాదవ్ తదితరులు దళితుల మీద దాడులు చేయడంతో పాటు దళిత మహిళలను దుర్భాషలాడుతూ దాడి చేశారని వాపోయారు. కుమ్మరి గండయ్య అనే వ్యక్తి దళిత మహిళలను బోనాలు సమర్పించకుండా అడ్డుకొని, మహిళల మీద దాడులు చేశాడన్నారు. కులవివక్షతో తమ మీద దాడిచేయడంతోపాటు మహిళలను బోనాలు సమర్పించకుండా అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా ఈ విషయమై పిర్యాదు అందిందని, గ్రామంలో విచారణ చేపట్టి, కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటానని గచ్చిబౌలి ఇన్స్‌పెక్టర్ జేమ్స్‌బాబు తెలిపారు. గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపడుతున్నట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

# నకిలీ విత్తనాల సరఫరా ముఠా అరెస్టు

## రూ. 20 లక్షల విలువైన విత్తనాలు స్వాధీనం

**కుత్బుల్లాపూర్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త** ఎటువంటి అనుమతి లేకుండా నకిలీ విత్తనాలను రైతులకు సరఫరాచేస్తున్న ముగ్గురు వ్యక్తుల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. బాలానగర్ డిప్యూటీ పోలీసు కమిషనర్ శ్రీనివాసరావు బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.నగరానికి చెందిన బిల్లిపల్లి నరేందర్ రెడ్డి, దాసరి వెంకటేశ్వరరావు, కరుణాకర్‌రాజులకు సేంద్రీయ విత్తనాల సరఫరాకు అనుమతి తీసుకుని గుజరాత్ రాష్ట్రంనుండి కొన్ని కెమికల్స్ ద్వారా విత్తనాలను తయారుచేసి రైతులకు విక్రయించి మోసం చేస్తున్నారు. రైతులకు నకిలీ లేబుల్స్ అతికించిన ప్యాకెట్లను తయారుచేసి విక్రయించడం ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. వీరివద్ద దొరికిన నకిలీ విత్తనాల విలువ సుమారు రూ.లు. 20లక్షలకు పైగా వుంటుందని వ్యవసాయ విభాగం అధికారులద్వారా తెలిసిందని వివరించారు.

అయితే వ్యవసాయ ఉత్పత్తున పెంపుకు వినియోగించే రసాయన ఎరువుల సరఫరాకు ఎలాంటి అనుమతి లేకున్నా వీరు 1160లీటర్ల నకిలీ రసాయనాలను పోలీసులు స్వాదీనం చేసుకుని వీరిముగ్గురిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. వీరివద్దనుండి మూడు మోబాయిల్ ఫోన్లు, ఒక టాటాఏసి వ్యానును స్వాదీనం చేసుకున్నారు. వీరిపై సెక్షన్ 184,284,420,291ఎ సెక్షన్లపై కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఓటి డిసిపి శోభన్‌కుమార్, స్పెషల్ ఆపరేషన్‌టీమ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్, జీడిమెట్ల పోలీసులు పాల్గొన్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న హిమాయత్‌సాగర్, పురానాపూల్ మూసీ జలాశయాలు

# ఇంకా జలదిగ్భందంలోనే పలు కాలనీలు

- పునరుద్ధరణ చర్యల్లో జిహెచ్‌ఎంసి, డిఆర్ఐ సిబ్బంది
- ఉధృతంగా ప్రవహిస్తున్న మూసి నది
- పురానాపూల్, ముసారంబ్రిడ్జివద్ద అధికారుల పర్యవేక్షణ
- పరిస్థితులకు అనుగుణంగా ట్రాఫిక్ మళ్లింపు

**హైదరాబాద్, సెప్టెంబరు 6,ప్రభాతవార్త:** మూడు రోజలుగా కురిసిన భారీ వర్షాలు ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతున్నాయి. వరదనీటితో అతలాకుతలమైన ప్రాంతాల్లో పునరుద్ధరణ చర్యలు మొదలయ్యాయి. భాగ్యనగరంలో కురిసిన అతిభారీ వర్షాల వల్ల పలుచోట్ల రోడ్లు, జనవాసాలు జలమయమయ్యాయి. మరికొన్ని చోట్ల చెరువులు, వాగులు, కాలువలు, నాలాలు ఉధృతంగా ప్రవహించాయి. వాటి కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాలతో నీటమునిగిన పలు కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఖైరతాబాద్ పెద్దగణేష్ ఎదురుగా ఉన్న ఓల్డ్ సిబిఐక్వార్టర్స్‌లో వర్షానికి భారీగా నీరు వచ్చి చేరింది. గతమూడురోజులుగా కాలనీల్లో మోకాళ్లలోతు నీరు నిలవడంతో.. స్థానికంగా ఉన్న ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులకు అనేకసార్లు దృష్టికితీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీరు నిల్వకుండా త్వరలో పనులు పూర్తి చేస్తామని అదికారులు చెబుతున్నా.. ఆచర ణలో కనిపించడంలేదని వాపోయారు. తాము అనుభవిస్తున్న బాధకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ గేట్లు ఎత్తివేత ..మూసీకి భారీగా వరదనీరు**

హైదరాబాద్‌లో విస్తారంగా కురిసిన వర్షాలతో జంటజలాశయాలకు పెద్ద స్థాయిలో వరదవచ్చి చేరుతుంది. ప్రస్తుతం హిమాయత్‌సాగర్‌లో.. 17 63 అడుగుల వరకు నీటి నిల్వ ఉండగా.. ఎగువ నుంచి 4 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుంది. దీంతో ప్రాజెక్ట్ ఆరు గేట్లు ఎత్తి 4,120 క్యూసె క్కుల నీటిని మూసిలోకి వదులుతున్నారు. ఇక ఉస్మాన్‌సాగర్‌లోనూ నీటిమట్టం 1790 అడుగులు ఉండగా..ఎగువ నుంచి 2,200 క్యూసెక్కుల వరద నీరువస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఆరుగేట్లు ఎత్తి 2వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జంటజలాశయాల నుంచి నీరు దిగువకు విడుదలచేయడంతో మూసి నదీ ఉధృతంగా ప్రవహిస్తుంది. జియాగూడ వద్ద పురానపూల్‌ను కలిసే రహదారిపై రెండు అడగుల మేర నీరు చేరింది. దీంతో రహదారిపై రాకపోక లను నిలిపివేశారు. మూసి నది ఆనుకుని ఉన్న పురానాపూల్ శ్మశానవాటికలోకి నీరు చేరింది. వర ప్రవాహం మరింత పెరిగితే మూసిపరివాహక ప్రాంతాల్లో ఉన్న వారిని ..సురక్షిత ప్రాంతాలలకు తరలించేందుకు అధికారుల యత్నిస్తున్నారు.అలాగే ముసారాం బాగ్ బ్రిడ్జి వద్ద అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు..నీరు బ్రిడ్జిపైకి వస్తే బారికేడ్లతో మూసివేసి ట్రాఫిక్ మళ్లిస్తు న్నారు. తగ్గాక యాథావిధిగా రాకపోకలకు అవకా శం కల్పిస్తున్నారు. మరోమూడరోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో.. జిహెచ్‌ఎంసి, డిఆర్‌ఎఫ్, పోలీసులు అధికారులు మూసీపరివాహక ప్రాంతాల్లో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు.

# జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేస్తా : అజారుద్దీన్

ఫిల్మ్‌నగర్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడానికి తాను దరఖాస్తు చేసుకున్నానని, ఇండియన్ మాజీ కెప్టెన్, ప్రముఖ క్రికెటర్, మాజీ ఎంపి అజారుద్దీన్ స్పష్టం చేశారు. పార్టీ ఎవరికి అవకాశం ఇస్తే వాళ్ళే ఎన్నికల బరిలో ఉంటారని అన్నారు. జూబ్లీహిల్స్ ఎవడబ్బ సొత్తుకాదని, అందరిదని స్పష్టం చేశారు. ప్రజల ఆధరాభిమానాలు చూరగొనాలే తప్పా, రౌడీయిజం పనిచేయవని ఇటీవల జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పర్యటిస్తున్న సందర్భంలో తనపై జరిగిన దాడినుద్దేశించి వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో కులమతాలు పనిచేయవని, విజయం సాధించాలంటే ప్రజలందరి ఆధరాభిమానాలు చూరగొనాలని అజారుద్దీన్ అన్నారు. తాను పుట్టి పెరిగిన ఊరు హైదరాబాద్ అని, జూబ్లీహిల్స్ సమీపంలో నివాసముంటున్నానని, రాజకీయాలు తనకు కొత్త కాదని, గతంలో ఎంపిగా పనిచేసిన అనుభవం ఉందని, ప్రజల సాధక, బాధకాలు తనకు తెలుసునని అజారుద్దీన్ అన్నారు. జూబ్లీహిల్స్ అభ్యర్థిని కాంగ్రెస్ అత్యున్నత స్థాయి కమిటీ నిర్ణయిస్తుందని, ఎవరి జోక్యం ఉండబోదని కుండబద్దలు కొట్టారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి తప్ప మరెక్కడా తాను పోటీ చేయనని అజారుద్దీన్ స్పష్టం చేశారు. దివంగత నేత పి.జనార్థన్‌రెడ్డి మహా గొప్ప నేత అని, ఆయన అడుగుజాడల్లో నడుస్తామని, నాయకుడంటే పిజెఆర్ లాగా ఉండాలని పొగడ్తలతో ముంచెత్తారు. ఇదిలా ఉండగా కొసమెరుపేమిటంటే ఇటీవల జూబ్లీహిల్స్‌లో విస్తృత పర్యటనలు నిర్వహించిన సందర్భంగా జిలా ్ల కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు భవాని శంకర్‌తో కలిసి ప్రముఖ సంఘసేవకులు కె.ఊపేందర్‌రెడ్డిని కలిసి మద్దతు కోరటం విశేషం.

# ఓటర్ల జాబితాను సవరించాలి

## మర్రి శశిధర్‌రెడ్డి

**బేగంపేట సెప్టెంబరు 6,ప్రభాతవార్త :** ఎన్నికల ఓటర్ల జాబితాను సవరించాలని మాజీ ఎన్‌డిఎమ్‌ఏ ఉపాధ్యక్షులు,బీజేపీ నాయకులు మర్రి శశిధరరెడ్డి డిమాండ్ చేసారు.బుధవారం జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోన్‌లో ఎన్నికల ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహించారు.సనత్‌నగర్ డీపీటీ కమీషనర్ శంకర్, ఏఈఆర్‌ఓ జగన్‌కుమార్, డీపీటీ కలెక్టర్ ప్రత్యేక అధికారి విజయలక్ష్మి నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మర్రి శశిధరరెడ్డి మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లలో మౌళిక సదుపాయాలపై కూడా శ్రద్ద వహించాలని కోరారు.వీటన్నింటిపై ఆయన వినతి పత్రం సమర్పించారు. సమావేశంలో బీజేపీ నేతలు శ్యాంసుందర్ గౌడ్, షేక్‌గౌస్, వజనాల దయానందరావు, నర్సింగరావు, రమేష్, ఈశ్వర్, వెంకట్, దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

# రావి ఆకుపై కృష్ణుడు




**అల్వాల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** కృష్ణాష్టమిని పురస్కరించుకుని రావి ఆకుపై కృష్ణుడి ఆకృతిని ఆవిష్కరించారు సూక్ష్మ చిత్రాల కళాకారుడు ప్రదీప్. అల్వాల్‌కు చెందిన ఆయన ఇప్పటికే వందలాది సూక్ష్మ చిత్రాలను ఆవిష్కరించి ప్రశంసలు అందుకున్నారు. దేశం పేరును ఇండియా నుంచి భారత్‌గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆకుపై భారత్ అనే పేరును ఆయన పొందు పరిచారు.

# ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్రంపై వత్తిడి తేవాలి

**ధర్నాచౌక్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త:** ఈనెల 18 నుండి 22 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం పై కాంగ్రెస్ పార్టీ వత్తిడి తేవాలని ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ నేతలు కోరారు. ఈ మేరకు వారు బుధవారం మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌కు వినతి పత్రం అందచేశారు. ముషీరాబాద్ ఇన్‌చార్జి రాజశేఖర్ గజ్జెల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గజ్జెల దయానంద్ మాదిగ, గిన్నారపు శ్యాంరావుమాదిగ, బుర్రజగదీష్ మాదిగ, ఎల్లయ్య మాదిగ, దశరథ్‌మాదిగ, రాములు మాదిగ తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నేతలు





గద్దర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

## ప్రజాగాయకుడు గద్దర్ విగ్రహావిష్కరణ

**అల్వాల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** ప్రజా గాయకుడు స్వర్గీయ గద్దర్ విగ్రహాన్ని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు బుధవారం ఆవిష్కరించారు. అల్వాల్ యాదమ్మనగర్ పాలమూరు వాసులుకాలనీ వద్ద విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. గద్దర్ కూతురు వెన్నెల, కుమారుడు సూర్యంల తోపాటు పెద్ద సంఖ్యలో కవులు, కళాకారులు విగ్రహావిష్కరణకు తరలివచ్చారు. పేద బలహీన వర్గాలు అభ్యున్నతి, హక్కుల సాధన కోసం గద్దర్ చేసిన పోరాటాల చరిత్రలో నిలిచి పోతాయని ఎమ్మెల్యే మైనంపల్లి ఈ సందర్భంగా అన్నారు. విగ్రహావిష్కరణ సందర్భంగా కళాకారులు గద్దర్ పాటలను పాడుతూ జోహార్లు అర్పించారు. గాయకుడు ఏపూరి సోమన్న, అశోక్, రేలారే రేలా గంగ, ప్రొఫెసర్ కాశీం, బైరి సురేష్, రాము, శివ, సుధాకర్, శ్రీను కార్పొరేటర్ జితేందర్‌నాథ్ బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, పరమేష్, శ్రీనివాస్‌గౌడ్, కొండల్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, రాజయ్య పాల్గొన్నారు.

## మదర్ థెరిస్సా సేవలు చిరస్మరణీయం : కేంద్ర మాజీ మంత్రి సర్వే


మదర్‌థెరిసా ్స జయంతి కార్యక్రమంలో సర్వే సత్యనారాయణ

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** మానవతావాది మదర్ థెరిస్సా సేవలు చిరస్మరణీయమని కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. మదర్ థెరిసా ్స వర్ధంతిని పురస్కరించుకొని సికి ంద్రాబాద్‌లోని మదర్ థెరి స్సా కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు అల్లాడి గౌరిశంకర్, నందికంటి రవి, ఆర్.డి.నాగేశ్ యాదవ్, శ్రీనాథ్, డి.బాబురావ్, జూడ్, శ్రీను పాల్గొన్నారు.

## అద్భుతంగా సాగిన సినీ గానలహరి

**చిక్కడపల్లి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** సుప్రసిద్ద సినీనేపథ్య గాయనీ మణులు సుశీల, భానుమతి, లీల, జిక్కి వంటి వారల పాటలను అలవోకగా ఆలపించడం గాయనీ ఎం.వి.రమణకుమారి విలక్షణ గాయని ప్రముఖ కళాపోషకులు, జివిఆర్ ఆరాధన సంస్థ అధినేత గుడిబండి వెంకటరెడ్డి అన్నారు. చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళా వేదికలో రాగరాగిణి సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణకుమారి, ఎంవి.సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో సినీ గానలహరి–సినీ గీత విభావరి కార్యక్రమం జరిగింది. గాయనీ గాయకులు శైలజ, కృష్ణకుమారి, సిహెచ్.లక్ష్మిశాంతి, హరిశ్రీలక్ష్మి, మోహనకృష్ణ, వేణుగోపాలచారి, రామకృష్ణ, అంజయ్యగుప్త, హనుమంతరెడ్డి, ప్రియవర్దన్ తదితరులు అద్భుతంగా గానం చేశారు. రమణకుమారి 40 సంవత్సరాలుగా వివిధ వేదికలపై గళం వినిపిస్తూ శ్రోతలను రంజింపచేస్తున్నారన్నారు.

## కథారచయిత్రి లక్ష్మికి వెంకటలక్ష్మి,సుబ్బయ్య స్మారక పురస్కారం

**హైదరాబాద్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** తల్లిదండ్రులే ప్రథమ గురువులని ప్రముఖులు పేర్కొన్నారు. చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావ కళావేదికలో భీమన్న సాహితీనిధి, కళానిలయం సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి హైమావతి భీమన్న జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె తల్లిదండ్రులు కొత్తూరి వెంకటలక్ష్మి–సుబ్బయ్య దీక్షితులు స్మారక పురస్కారాన్ని కథారచయిత్రి జిఎస్.లక్ష్మికి అందించడం జరిగింది. ముఖ్యఅతిథిగా విశ్రాంత పోలీసు ఉన్నతాధికారి సుంకర సత్యనారాయణ హాజరై ప్రదానం చేసి ప్రసంగించారు. జిఎస్.లక్ష్మి ఉపాధ్యాయినిగా, మంచి కథకురాలు అని అభినందించారు. హైమావతి భీమన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ వేంకటేశరస్వామి దేవాలయం చైర్మన్ వైఎస్ఆర్.మూర్తి, లీలారెడ్డి, కళానిలయం సురేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పేరిణి సందీప్ శిష్య బృందం నాట్యఅంశాలు అందరిని ఆకట్టుకున్నాయి.

## చిన్నారుల వేషధారణలతో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు



శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు

**చిక్కడపల్లి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** బాగ్‌లింగంపల్లిలోని బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు బుధవారం కనులపండువగా నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణ వేషధారణలతో, నృత్యసంగీత కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా విద్యాసంస్థల డైరెక్టర్ రుషికుమార్, ప్రిన్సిపాల్ విఠలాచారి, డాక్టర్ సృజన, డాక్టర్ భవానీ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శన నిర్వహించిన చిన్నారులను నిర్వాహకులు సత్కరించి అభినందించారు.

## సిఎం కెసిఆర్‌కు రుణపడి ఉండాలి : మర్రి రాజశేఖర్ రెడ్డి

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** రూపాయి ఖర్చు లేకుండా ఇండ్లులేని పేదలకు సిఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్ ఇచ్చినందుకు లబ్ధిదారులు రుణపడి ఉండాలని మలా ్కజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన పేదలకు 2వ విడతలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ప్రభుత్వం ఇచ్చినందుకు బుధవారం లబ్ధిదారులు మర్రి రాజశేఖర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సనత్‌నగర్ బిజెపి అభ్యర్థిగా అవకాశం కల్పించండి..దరఖాస్తు చేసిన చీరె

**బేగంపేట సెప్టెంబరు 6, ప్రభాతవార్త :** సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుతూ రాంగోపాల్‌పేట కార్పోరేటర్ చీరె సుచిత్ర భర్త సనత్‌నగర్ నియోజకవర్గం బీజేపీ నాయకులు చీరె సత్యనారాయణ(శ్రీకాంత్)బుధవారం బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తాను ఎంతో కాలంగా బీజేపీ లో ఉంటూ పార్టీ నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని,తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించానని,రానున్న ఎన్నికల్లో తనకు సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరుపునా టికెట్ ఇస్తే తప్పక విజయం సాధిస్తానని,బీజేపీ జెండా ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేసారు.


దరఖాస్తు చేస్తున్న కార్పొరేటర్ చీరె సుచిత్రా చీరె సత్యనారాయణ

# సంక్షేమ పథకాలే బిఆర్ఎస్‌ను గెలిపిస్తాయి

### మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్


హమాలీ బస్తీకి చెందిన వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** సిఎం కేసీఆర్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలే తిరిగి బిఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తాయని పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యదవ్ స్పష్టం చేశారు. బుధవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాలీ బస్తీకి చెందిన 70 మంది యువత బిఆర్ఎస్ నేత సురేష్ ఆధ్వర్యంలో శివకుమార్, వినోద్, సన్నీ, శ్రీకాంత్, జిలానీ నాయకత్వంలో మంత్రి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి వారికి గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సిఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వంతోనే తమకు మేలుజరుగుతందనే విశ్వాసంతో ప్రజలు ఉన్నారని తెలిపారు. పలు రకాల పింఛన్‌లతోపాటు అనేక సంవత్సరాలుగా పేదలు ఎదురు చూస్తున్న సొంతింటి కలను నెరవేర్చిన ఘనత కూడా తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. 24 గంటపాలు విద్యుత్ సరఫరా చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రజల సాంప్రదాయాలు, ఆచారాలను గౌరవిస్తు అన్ని పండుగలను ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజలు ఎంతో గొప్పగా జరుపుకుంటున్నారని తెలిపారు సనత్‌నగర్ నియోజకవర్గంలో దాదాపు 50 సంవత్సరాలుగా జరుగనంత అభివృద్ధి గడిచిన 9 సంవత్సరాలలో జరిగిందని, అభివృద్ధి కార్యక్రమాలు కండ్లముందే కనిపిస్తున్నాయని వివరించారు. సుమారు రూ. 1600 వందల కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి కార్యాక్రమాలను చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు.తాజాగా హమాలీ బస్తీలోనూ డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, పద్మారావు నగర్ బీఆర్ఎస్ ఇంచార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు ఎల్. వెంకటేషన్ రాజు, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


బ్రాహ్మణవాడీలో కాగడాల ర్యాలీ నిర్వహిస్తున్న కోట నీలిమా తదితరులు

## నాలా అభివృద్ధి చేస్తే.. బస్తీల ముంపు ఎలా జరిగింది?

### టిపిసిసి ప్రధాన కార్యదర్శి కోట నీలిమా

**బేగంపేట సెప్టెంబరు 6, ప్రభాతవార్త :** రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని బేగంపేట డివిజన్ బ్రాహ్మణవాడీ మురుగు నీటి ముట్టడిలో చిక్కుకుందని తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమా ప్రశ్నించారు.భారీ వర్షాలతో మురుగు నీటిలో చిక్కుకున్న వడ్డెర బస్తీ, బ్రాహ్మణవాడీ ప్రాంతాన్ని కోట నీలిమా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె కాగడాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాలా అభివృద్ధి చేసామంటూ ప్రకటనలు చేస్తున్న వారు వర్షం కురిస్తే బస్తీలు ఎలా మునిగి పోయాయో చెప్పాల్సి న అవసరం ఉందన్నారు. ఎలాంటి శాస్త్రీయ సర్వేగానీ ముంపుపై అవగాహన లేకుండా నాలాభివృద్ధి చేసామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నాలా అభివృద్ధి పనుల్లో అవినీతి చోటు చేసుకుందని ఇది ప్రజలకు సమాధానం చెప్పాల్సి న అవసరం ఉందన్నారు.అవినీతిపై విచారణ చేయాలని ఆమె డిమాండ్ చేసారు. ముంపుకు గురైన ప్రాంతాలను అధికారులు పరిశీలించకపోవడం దారుణమన్నారు. వర్షం నీటిలో చిక్కుకున్న నివాస గృహాల వారికి తాగునీరు,అల్పాహారం,భోజనం అందించాల్సి న బాధ్యత అధికారులపై లేదా అని ఆమె ప్రశ్నించారు.వర్షం తరువాత ఈ ప్రాంతంలో దోమల దాడితో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని,ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి ఈ ప్రాంత ప్రజలకు వరద నీటి ముప్పు నుంచి విముక్తి కల్పించేలా చర్యలు చేపట్టాలని కోట నీలిమా డిమాండ్ చేసారు.

## ట్రాఫిక్ నియమాలు పాటించాలి

**గోషామహల్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని వినాయక పత్రిమలను అమ్మకాలు చేసే వారు ట్రాఫిక్ నియమాలను పాటించి, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్–3 డిసిపి శ్రీనివాస్‌గుప్త కోరారు.ఈమేరకు గోషామహల్ ట్రాఫిక్ పోలీసు, మంగళ్‌హాట్ పోలీసుల ఆధ్వర్యంలో రహీంపురా గ్లౌడమంతం పంక్షన్‌హాల్‌లో వినాయక పత్రిమ అమ్మకం దారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూల్‌పేట్, మంగళ్‌హాట్, పురానాపూల్, రహీంపురా పరిసర ప్రాంతాలల్లో వినాయక పత్రిమలను తయారు చేసి అమ్మకందారులు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ప్రతిమలను అమ్మకాలను చేసుకోవాలన్నారు. అందుకు ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులకు అన్నివర్గాల ప్రజలు కూడా సహకరించాలన్నారు. గోషామహల్ లా అండ్ ఆర్డర్ ఏసిపి వెంకట్‌రెడ్డి, ట్రాఫిక్ ఎసిపి ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ కె.మహేష్, హాబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్,అమ్మకం దారులు పాల్గొన్నారు.

## శానిటేషన్ సిబ్బందితోనే పరిశుభ్రత

**అడ్డగుట్ట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** విధి నిర్వహనతో పాటు వ్యక్తిగత రక్షణ సిబ్బందికి ఎంతో అవసరమని కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. జిహెచ్‌ఎంసి పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి బుధవారం కార్పొరేటర్ లింగాని చేతులు మీదుగా రేన్ కోట్లను అంద జేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో శానిటేషన్ సేవలు ఎంతో అవసరమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, జిహెచ్‌ఎంసి సూపర్ వైజర్ గబ్బార్ తదితరులు పాల్గొన్నారు.


బంజారాహిల్స్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న మోడల్స్


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

## సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

**హైదరాబాద్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** అంబర్‌పేట డివిజన్‌లోని బుర్జు గల్లీలో 22 లక్షలతో చేపట్టనున్న నూతన సిసి రోడ్డు పనులకు బుధవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ సిఎం కెసిఆర్ నాయకత్వంలో అంబర్‌పేట నియోజకవర్గంలో దశాలవారీగా అభివృద్ధి జరుగుతున్నాయని, అన్నికాలనీల్లో, బస్తీల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కమ్యూనిటీహాల్ నిర్మాణం పనులను త్వరగా పూర్తిచేస్తాం :కార్పొరేటర్


కమ్యూనిటీ హాలో నిర్మాణం పనులను తెలుసుకుంటున్న దేవేందర్‌రెడ్డి

**నాచారం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అశోక్ నగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన కమ్యూనిటి హాల్ నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. హాల్ నిర్మాణంకోసం కాలనీవాసులు సూచించిన విధంగా వారి సూచలను సలహాలకు అనుగుణంగా పనులు చేయాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ.శ్రవంతి, స్థానిక కాలనీ వాసులు మల్లికార్జున్‌గౌడ్, బుసాని రఘు,మొలసి శ్రీనివాస్ రెడ్డి, శీలం ప్రవీణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల డిమాండ్లను అమలు చేయాలి:బాల్‌రాజ్

**సైఫాబాద్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** రాష్ట్రంలో 149 ఐసిడిఎస్ ప్రాజెక్టులలో 70 వేల మంది అంగన్‌వాడీ కార్కర్తలు, మినీ అంగన్‌వాడీలు, ఆయాలు గత 48 సంవత్సరాలుగా పనిచేస్తున్న వీరికి గత కొన్ని సంవత్సరాలుగా వేతనాలు పెంచకుండా ప్రభుత్వం నిర్లక్ష్య దోరణి అవలంబించడాన్ని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ తీవ్రంగా ఖండించారు. రోజుకు 15 గంటలపాటు పనిచేస్తున్న ఉద్యోగులకు, కార్మికులకు ప్రభుత్వం తక్కువగా వేతనాలు చెల్లిస్తూ వారి శ్రమశక్తిని దోపిడీ చేస్తున్నదని ఆరోపించారు. తమ డిమాండ్ల సాధన కోసం చేసే సమ్మకు ఎఐటియుసి సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని ఆయన ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు.

## ఉదయనిధిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

**అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** హిందువుల మనోభావాలను దెబ్బతీనే విధంగా వ్యవహరించిన తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు ఉదయ్‌నిధి స్టాలిన్ సైబర్‌క్రైం విభాగంలో తెలంగాణ భజరంగ్‌సేనా ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు.బుధవారం బషీర్‌బాగ్‌లోని సైబర్ క్రైం కార్యాలయంలో ఎసిపి శివమారుతిని తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మన్‌రావుగుప్త, మహిళా అధ్యక్షురాలు రంజని శ్రీరామోజు,ప్రధాన కార్యదర్శి సూర్యశుక్లా, ఉపాధ్యక్షులు నందకిషోర్ అగర్వాల్, ఎం.మనోజ్, నరేష్, ప్రవీణ్‌యాదవ్‌లు కలిసి ఉదయ్‌నిధి స్టాలిన్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని పూర్తిగా నిర్మూలించాలన్న వ్యాఖ్యలపట్ల స్టాలిన్‌పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


సైబర్ క్రైం ఎసిపి శివమారుతికి వినతిపత్రం అందచేస్తున్న భజరంగ్‌సేనా అధ్యక్షులు

# వరదనీటిలో చిక్కుకుని ఇబ్బందులుపడుతున్న ప్రజలు

### మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధరరెడ్డి


బ్రాహ్మణవాడీలో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీజేపీ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు

**బేగంపేట సెప్టెంబరు 6,ప్రభాతవార్త :** కూకట్‌పల్లి నాలాలో వరద నీటి ప్రవాహం సాఫీగా సాగేందుకు తీసుకోవాల్సి న చర్యలలో అధికారులు విఫలం చెందడంతోనే ప్రతి ఏటా బేగంపేట పరిధిలోని పలుప్రాంతాలు వరద నీటిలో చిక్కుకుని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎన్‌డిఎమ్ఏ ఉపాధ్యక్షులు, సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధరరెడ్డి అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సనత్‌నగర్ నియోజక వర్గం బేగంపేట డివిజన్ బ్రాహ్మణవాడీ లైన్ నెంబరు 2,3,4, 7లు వరదనీటిలో చిక్కుకున్న విషయం తెల్సుకున్న మర్రి బీజేపీ నాయకులతో కల్సి ఆ ప్రాంతాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు.గతంతో పోల్చుకుంటే ఈ ప్రాంతాల్లో వరద ముంపు ఏ మాత్రం తగ్గలేదన్నారు.కొన్ని ప్రాంతాల్లో రోడ్డు ఎత్తు పెంచుతూ జరిపిన నిర్మాణాలతో ముంపు తీవ్రత మరింత పెరిగిందని స్థానికులు తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు.రోడ్డు ఎత్తుకు సంబంధించిన విషయాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే వారిని బెదిరింపులకు గురిచేస్తున్నారని స్థానికులు తనకు వివరించారన్నారు. ఈ సందర్భంగా మర్రి శశిధరరెడ్డి మాట్లాడుతూ పై ప్రాంతాల నుంచి వస్తుండే వరద నీరు సాఫీగా పారేందుకు వీలైన చర్యలు తీసుకోవడంలో అధికారులది పూర్తి వైఫల్యం కన్పిస్తుందన్నారు. నాలాల్లో వరద నీటి సామర్థ్యం దాటి ప్రవహిస్తే అపుడు వన్ సైడ్ వాల్వులు ఏర్పాటు చేయడం ద్వారా నీటిని నియంత్రించే వీలుంటుందన్నారు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే నాలా డీ సిల్టింగ్ పనులు జరుగుతుండే సమయంలో తొలగించిన పూడికలను బయటకుతరలించకుండా రిటైనింగ్ గోడల వద్దకు చేర్చి చేతులు దులుపుకుంటుండటం ఇక్కడ కనిపిస్తుందన్నారు.ఆ విధంగా చేయడం వల్ల పక్కకు తొలగించిన పూడిక తిరిగి నాలాలోకి చేరుతుందని, దీంతో సమస్య మళ్లీ మొదటికి వస్తుందని, డీసిల్టింగ్ విషయంలో అధికారుల వైఫల్యం అడుగడుగునా కనిపిస్తుందన్నారు.అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలన్నారు.

ఈ కార్యక్రమంలో మర్రి శశిధర్‌రెడ్డి వెంట బీజేపీ నాయకులు నెమలి ఆనంద్, షేక్‌గౌస్, అరుణ్, సురేంద్రరెడ్డి, రవీంద్రరెడ్డి ఉన్నారు.

## ముంపునకు గురైన బ్రాహ్మణవాడీ

### కాంగ్రెస్ నేత రవీందర్‌గౌడ్

**బేగంపేట సెప్టెంబరు 6,ప్రభాతవార్త :** సనత్‌నగర్ నియోజకవర్గం ప్రజలను వరదల నుంచి రక్షించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రవీందర్ గౌడ్ అన్నారు. సోమ,మంగళవారాల్లో కురిసిన భారీ వర్షాలకు బేగంపేట బ్రాహ్మణవాడీ, వడ్డెర బస్తీ, తదితర ప్రాంతాలు నీట మునిగాయని, ప్రతి ఏటా ఈ ప్రాంతాలు వరద నీటి ముంపుకు గురవుతున్నా వారిని వరదల నుంచి రక్షించేందుకు ఏ విధమైన చర్యలు చేపట్టలేక పోవడం దారుణమని ఆయన ఆరోపించారు. డల్లాస్‌లా తీర్చిదిద్దుతామంటూ గొప్పలు చెప్పుకునే అధికార పార్టీ నేతలు ప్రజలను మురుగు నీటి ముట్టడి నుంచి రక్షించలేక పోయారన్నారు.నియోజకవర్గంలో ఎక్కడ చూసినా డ్రైయినేజీలు పొంగి రోడ్లపై పారుతున్నాయని, చిన్న చిన్న సమస్యలనే పరిష్కరించలేని వారు అభివృద్ధి చేసామంటూ ఎలా చెప్పుకుంటారని ఆయన ప్రశ్నించారు.ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఆయన గడప గడపకు తిరిగి 300 ఆహార పొట్లాలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ తోట మణిమాల, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్, కమల్‌రాజ్, ప్రవీణ్ కుమార్, కనకరాజు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆటోడ్రైవర్లకు రెయిన్ కోట్‌లు అందజేత

**తార్నాక, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** హైదరాబాద్ సిటీనీ క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చేందుకు స్వచ్ఛ ఆటో డ్రైవర్లు పనిచేయాలని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి సూచించారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో ఆటోడ్రైవర్లకు డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి బుధవారం రెయిన్ కోట్‌లను అందజేశారు. ఆటోడ్రైవర్లు ఇంటింటికి చెత్త సేకరణ చేయాలని అదేవిదంగా స్లమ్స్‌లల్లో ఎక్కువ ఫోకస్ పెట్టి ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా చెత్త బయట పారవేస్తున్న వారిపై చర్యలు తసుకునేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాని పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్ నగరం ముందంజలో ఉందన్నారు. స్వచ్ఛడ్రైవర్ల ఆరోగ్య రక్షణకు రబ్బరు గ్లౌస్‌లను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు మోతె శోభన్ రెడ్డి తదదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య, స్వచ్ఛ ఆటో కార్మికుల సేవలు వెలకట్టలేనివి : ఎమ్మెల్యే

**చిక్కడపల్లి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** పారిశుధ్య, స్వచ్ఛ ఆటో కార్మికుల సేవలు వెలకట్టలేనివని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యునిటీ హాల్‌లో స్వచ్ఛ ఆటో కార్మికులకు రైన్‌కోట్స్ పంపిణీ కార్యక్రమం జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరై వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛ ఆటో కార్మికులకు కెసిఆర్ ప్రభుత్వం అండగా నిలస్తోందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహ, జిహెచ్‌ఎంసి ఏఎంఒహెచ్ డాక్టర్ మైత్రేయి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, నేతలు ముచ్చకుర్తి ప్రభాకర్, ముఠానరేశ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్త, గుండు జగదీశ్‌బాబు,రవిశంకర్‌గుప్త, గడ్డమీది శ్రీనివాస్, పి.సత్యనారాయణ, రాజ్‌కుమార్, సుధాకర్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు పట్టంకట్టేవాడే నిజమైన ఉపాధ్యాయుడు

**చిక్కడపల్లి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త:** ప్రతిభకు పట్టంకట్టేవాడే నిజమైన ఉపాధ్యాయుడు అని వక్తలు పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రతి చిన్నారికి మొదటి గురువు కాగా వారి భవిష్యత్తు జీవితానికి పునాదిరాళ్ళు తల్లిదండ్రులు జన్మనిస్తే వారి శ్రేయోభివృద్ధిలకు నిరంతరం తప్పించేవాడే అని అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఉపాధ్యాయుడి పాత్ర ఎంతో గొప్పదని, వారి అభివృద్ధిలో తల్లిదండ్రులు, స్నేహితులు, గురువులు పాత్ర ఎంతో ఉంటుందన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ రుషికుమార్, ప్రిన్సిపాల్ విఠలాచారి, డాక్టర్ సృజన, డాక్టర్ భవానీ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఏం చేశారని లక్ష మెజార్టీతో గెలుస్తారు? : రామకృష్ణ

**కంటోన్మెంట్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గానికి బిఆర్ఎస్ ప్రభుత్వం ఏమిచేసిందని లక్షమెజార్టీతో గెలుస్తారని కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామక్రిష్ణ ప్రశ్నించారు. బోర్డు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కంటోన్మెంట్‌లో లక్ష మెజార్టీతో విజయం సాధిస్తామని ప్రకటించడం హాస్యస్పదంగా ఉందన్నారు. గ్రేటర్‌లో కంటోన్మెంట్ ఎసీ ్స రిజర్వుడ్ ఉన్న నియోజకవర్గానికి బిఆర్ఎస్ ప్రభుత్వం సవతి ప్రేమ చూపుతుందని ఆరోపించారు. శివారు ప్రాంతాల్లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లల్లో నియోజకవర్గానికి ఒక్కొక్క నియోజకవర్గానికి 500 కెటాయించగా, కంటోన్మెంట్‌కు 200 మందికే కెటాయించారన్నారు. బోనాల జాతర ఉత్సవాల్లో నగరంలోని పలు నియోజకవర్గాలకు రూ.1.80 కోట్లు కేటాయించగా కంటోన్మెంట్‌కు రూ.56 లక్షలు మాత్రమే కేటాయించిందన్నారు. నగరంలోని గ్రేవ్ యార్డుల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిందికాదని కంటోన్మెంట్ అసెంబ్లీ పరిధిలోఉన్నగ్రేవ్ యార్డుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుపెట్టలేదన్నారు. కంటోన్మెంట్‌పై సవతి ప్రేమ చూపుతున్న బిఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో ఎలా ఓట్లువేస్తారని ప్రశ్నించారు.

## 8 నుంచి పెరుమాల్ దేవాలయంలో బాలాలయ ప్రతిష్ట వేడుకలు

**అడ్డగుట్ట, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ మోండా డివిజన్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీవెంకటేశ్వర పెరుమాల్ ఆలయంలో ఈ నెల నుంచి 10వ తేదీవరకు శ్రీ వెంకటేశ్వరస్వామి బాలాలయ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ వై.నరా ్సరెడ్డి, ఈఓ కె.పి.సత్య మూర్తిలు తెలిపారు. బుధవారం శివాజీ నగర్‌లోని వారు మాట్లాడుతూ 200 సంవత ్సరాల చరిత్రకలిగిన ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచిందన్నారు. ఆలయ పునః నిర్మాణం పనుల్లో భాగంగా ముందుగా అలయంలో శ్రీవెంకటేశ్వర స్వామి బాలాలయ ప్రతిష్టి మహో త ్సవ వేడుకలు టీటీడి వేద పాఠశాలకు చెందిన బృందం చేత పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి ్సభ్యులు కశిరెడ్డి నరేందర్ రెడ్డి, శేఖర్ ముదిరాజ్, కె.గోవింద్, ఆలయ ప్రధాన అర్చకులు సారధి తదితరులు పాల్గొన్నారు.


బాలాలయ ప్రతిష్ట కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

## దివ్యాంగులకు ఎలక్ట్రికల్ మోటార్ వెహికల్ పత్రాలు అందజేత..

**ఫిల్మ్‌నగర్, సెప్టెంబర్ 6, ప్రభాతవార్త :** ఖైరతాబాద్ నియోజకవర్గం బంజారాహిల్స్‌లోని బంజారా ఫంక్షన్ హాల్లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ సమక్షంలో బుధవారం దివ్యాంగులకు ఎలక్ట్రికల్ మోటార్ వెహికల్ పత్రాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి, జిల్లా బిజెపి అధ్యక్షులు డా.గౌతమ్‌రావు, ప్రధాన కార్యదర్శి సి.క్రిష్ణాగౌడ్ పాల్గొన్నారు.

## డిఎస్ఎస్ సికింద్రాబాద్ నియోజక వర్గ కోఆర్డినేటర్‌గా అశోక్‌బాబు

**తార్నాక, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** దళిత సంఘర్షన సమితి (డిఎస్ఎస్) సికింద్రాబాద్ నియోజక వర్గ కోఆర్డినేటర్‌గా లాలాపేట్ వినోభానగర్‌కు చెందిన ఎం.అశోక్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు డిఎస్ఎస్ నేషనల్ కోఆర్డినేటర్ నల్లా రాధాకృష్ణ నియిమకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నల్లారాధా కృష్ణ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం డిఎస్ఎస్ కృషి చేస్తుందన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలే, డా.బిఆర్.అంబేద్కర్, కాన్షీరాం, ఆశయాలకు అనుగుణంగా డిఎస్ఎస్ ముందుకెళ్లుతుందన్నారు.


అశోక్ బాబుకు నియామకపు పత్రాన్ని అందిస్తున్న నల్లా రాధాకృష్ణ

## యూఎల్‌సీ సమస్యను పరిష్కరించాలని చీఫ్ సెక్రటరీని కలిసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


చీఫ్ సెక్రటరీ శాంతకుమారికి సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : హస్తినా పురం డివిజన్ ధాతునగర్‌కాలనీలో ఎన్నోఏండ్లుగా ఎదుర్కొంటున్న యూఎల్‌సీ సమస్యలపై ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలంగాణ చీఫ్‌సెక్రటరీ శాంతకుమారిని కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాతునగర్‌లో 1505 గజాల స్థలం యూఎల్‌సీలో ఉండడంతో 470 గజాల స్థలం రెగ్యులరైజేషన్ చేసామని, మిగతా స్థలం రెగ్యులరైజేషన్ చేయకపోవడంతో దాదాపు 254 ఇండ్ల వాసులకు సెక్షన్ 22ఏ ప్రకారం రిజిస్ట్రేషన్లు జరగడం లేదని తెలిపారు. రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో ఇండ్లు కట్టుకోవడానికి అనుమతులు రావడంలేదని యూఎల్‌సీ సమస్యను పరిష్కరించాలని శాంతకుమారిని కోరడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులచే చర్చలు జరిపి సాధ్యమైనంత వరకు సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధాతునగర్ కాలనీ సభ్యులు పద్మిని పాల్గొన్నారు.

## అమర వీరుల త్యాగాలను స్మరించుకోవాలి : మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి


లెఫ్టినెంట్ కల్నల్ ఉప్పల వినయ్‌భానురెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

మల్కాజిగిరి, సెప్టెంబరు 6 ప్రభాతవార్త: అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ప్రజలందరిపై ఉందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌రాష్ట్రంలో విధి నిర్వహణలో అసువులు బాసిన లెఫ్టినెంట్ కల్నల్ ఉప్పల వినయ్‌భానురెడ్డి కాంస్య విగ్రహాన్ని మల్కాజిగిరి సర్కిల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిచిన్న వయస్సులోనే లెఫ్టినెంట్ కల్నల్‌గా భాధ్యతలు నిర్వహిస్తూ దేశానికి సేవ చేశారని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఇలాంటి మహనీయులను గుర్తుంచుకునే విధంగా విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.ఎన్.వి.సతీష్‌కుమార్, గుండా నిరంజన్, సత్తయ్య, సంతోష్ రాందాస్, సత్యమూర్తి, ఉమాపతి, ఓంరాజ్, బ్రహ్మయ్య, నాగేష్, నహీం ఖాన్,సయ్యద్ మబ్బు, భాగ్యనంద్ రావు, చందు, బంధువులు మధుసూదన్ రెడ్డి, బి.కృష్ణరెడ్డి, వెంకట్‌రెడ్డి, వి.కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ముందు ప్రజలను ప్రలోభపెడుతున్న సిఎం కెసిఆర్ : రావుల ఝాన్సీ


కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పిస్తున్న రావుల ఝాన్సీ తదితరులు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: గతఎన్నికలకు ముందు సిఎం కెసిఆర్ ప్రకటించిన హామీలన్నింటినీ అమలు చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక, ఎఐసిటియు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల ఝాన్సీ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె పలువురు నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9 సంవత్సరాలనుండి అధికారంలో కొనసాగుతున్న సిఎం కెసిఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారని, ఎన్నికలకు ముందు ప్రజలను ప్రలోభపెట్టి తిరిగి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇళ్లు లేని పేదలకు న్యాయం చేయాలనీ ధరణిలో లోపాలను సరిదిద్దాలని, పంటల భీమా పథకాన్ని అమలు చేయాలని, రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్రమోని పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జున ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి


శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

మలక్‌పేట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : ఓల్డ్‌మలక్‌పేటలోని మల్లికార్జునస్వామి దేవాలయంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జన్మాష్టమి పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఛైర్మన్ చౌకి రవికుమార్, డాక్టర్ యాదగిరి, పూజారి కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని పేర్కొన్నారు. గురువారం కూడా ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, మదన్, శ్రీనివాస్, రామయాదవ్, రాజేష్, రేవంత్, హిందు సుకేష్‌జీ, రాజు, ప్రసన్నలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన : సునీల్


సిసి రోడ్డు పనులను ప్రారంభించిన కౌన్సిలర్ కాకుమాన్ సునీల్ తదితరులు

తుర్కయంజాల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రామిరెడ్డి సహాయ సహకారాలతో 18వ వార్డు భవానిపురం కాలనీలో 12 లక్షల రూపాయలతో నూతన సిసి రోడ్డు పనులకు బుధవారం కౌన్సిలర్, టిపిసిసి సభ్యులు కాకుమాను సునీల్ శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ కాలనీల ప్రజలు ఇబ్బందులు పడకుండా డ్రైనేజీ, సీసీ రోడ్డు, మంచినీళ్లు, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కాలనీలలో ఎలాంటి సమస్యలున్న ముందుండి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు రామయ్య, సుధాకర్, ప్రకాష్, రాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## బిఎల్‌ఆర్‌కు కార్పొరేటర్ శ్రీదేవి మద్దతు


బిఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి తదితరులు

కుషాయిగూడ, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : ఉప్పల్ నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు పార్టీ నిర్ణయించిన అభ్యర్థిని గెలిపిచేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. బిఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పార్టీలో అందరిని కలుపుకునిపోతానని, ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేస్తామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాహనాల నెంబర్ల వేలంలో రూ. 9,99,999 ధర పలికిన టిఎస్ 11 ఇజడ్ 9999 : ఆర్టీఓ

మలక్‌పేట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : మూసారాంబాగ్ ఈస్ట్ జోన్ ఆర్టీఏ కార్యాలయంలో స్పెషల్ నెంబర్ల వేలం కార్యక్రమాలను నిర్వహించగా రూ. 18లక్షల2వేల970 నగదు ఆదాయంగా వచ్చిందని మలక్‌పేట ఆర్టీఓ సుభాష్ చంద్రారెడ్డి వివరించారు. టిఎస్11ఇజడ్ 9999 నెంబర్‌కు రూ. 9,99,999 లకు ఈ నెంబర్‌ను దక్కించుకున్నారని ఆయన వివరించారు. అదే విధంగా టిఎస్ 11 ఎఫ్ఎ 0001 నెంబర్‌ను వేలంలో కామినేని సాయిశివనాగ్ రూ. 3.5లక్షలకు, టిఎస్11ఎఫ్ఎ 0011నెంబర్‌ను సాలం రోహిత్‌రెడ్డి రూ. 1,55,400 లక్షలకు, టిఎస్ 11 ఎఫ్ఎ 0007 నెంబర్‌ను ఎన్.కవిత రూ. 80,100కు, టిఎస్11 ఇజడ్ 9990 నెంబర్‌ను ఎం.సంధ్య రూ. 55,990 లకు, టిఎస్11ఎఫ్ఎ 0027 నెంబర్‌ను సి.శ్రీరాజ్ రూ.36,059లకు, టిఎస్ 11ఇజడ్ 0015 నెంబర్‌ను ప్రత్యురాజ్ రూ. 16,111లకు దక్కించుకున్నారని ఆయన తెలిపారు. పలుప్రత్యేక నెంబర్లకు ఫీజుగా రూ. 2లక్షల 1వేయి తీసుకోవడం జరిగిందని, నెంబర్లకోసం వేలంప్రక్రియ నిర్వహించగా పైన పేర్కొన్న నెంబర్లు అన్నింటికి కలిపి రూ. 16లక్షల 1 వేయి 970 వచ్చిందని తెలిపారు.

## బిఆర్ఎస్‌కు హఠావో తెలంగాణా బచావో : ఏఐవైఎఫ్

సైదాబాద్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఓట్లు అడిగే హక్కు లేదని ఏఐవైఎఫ్ హైద్రాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్ అన్నారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన బిఆర్ఎస్‌కు హఠావో తెలంగాణా బచావో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రం రావడానికి కారణమైన నీళ్లు, నిధులు, నియామకాలు అనే డిమాండ్స్‌ను బిఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఉద్యోగాల కల్పనలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటు అడిగే హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్, మహబూబ్ అలీ, అంజయ్య, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలు అందించినప్పుడే గుర్తింపు

ఎల్.బి.నగర్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త: ఎల్ఐసి 67వ భీమా వారోత్సవాలు ఈ నెల 1వతేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న భీమా వారోత్సవాలలో భాగంగా దిల్‌సుఖ్‌నగర్‌శాఖలో విశిష్ట సేవలు అందించిన సీనియర్ ఏజెంట్లను బ్రాంచ్ మేనేజర్, స్టాఫ్, లియాఫీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీత ప్రెస్ పబ్లిసిటీ చైర్మన్ జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పాలసీదారులకు మరిన్ని సేవలను అందిస్తామని, దేశంలోనే దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్‌కు మంచి గుర్తింపు వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. సన్మానగ్రహీతలు జి.కోటయ్య, జన్నేపల్లి శ్రీనివాసరెడ్డి, బి.రామ్మోహన్‌రావు, విజయ భాస్కర్‌రెడ్డి, పిహెచ్‌వి.నాయుడులను బ్రాంచ్ మేనేజర్ బి.సత్యనారాయణ, లియాఫీ నాయకులు రాంబాబు, రామస్వామి, పద్మావతి, కే.సుబ్బారావు, ఏ.అనితరెడ్డి, ఆల్‌ఇండియా, డివిజన్ నాయకులు బి. శ్రీరామ్, జి.కోటయ్య, స్టాఫ్ యూనియన్ శోభ, స్వర్ణలత, సోమ్లానాయక్ సన్మానించారు.

## డివిజన్ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు : కార్పొరేటర్ రాజ్యలక్ష్మి..

నేరెడ్‌మెట్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఇటీవల డివిజన్ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్ లైన్ నెంబర్40లో గత కొన్ని సంవత్సరాలుగా రోడ్ మధ్యలో ఉన్న విద్యుత్ స్థంభాన్ని ఆమె సంబంధిత అధికారులతో కలసి చర్చించి తొలగించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యుత్ స్థంభం రోడ్డు మధ్యలో ఉండడం వల్ల వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులకు గరవుతున్నారని తెలిపారు. అట్టి సమస్య తన దృష్టికి రావడంతో వెంటనే సంబంధిత అధికారులతో కలసి చర్చించి పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అధ్వాన్న రోడ్లకు మరమ్మతులు : రాఘవేందర్‌రెడ్డి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి తన స్వంత డబ్బులతో అధ్వాన్న రోడ్డుకు మరమ్మతులు చేయించి ఆదర్శంగా నిలిచారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 26వ డివిజన్‌కు సంబంధించిన శ్రీశ్రీహోమ్స్ కాలనీలో రోడ్లు అధ్వాన్నంగా మారి ప్రజలకు ఇబ్బందులు అవుతున్న నేపథ్యంలో స్పందించిన ఆయన మట్టి పోయించి జెసిబితో చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు గుంతలమయమైన రోడ్లతో అవస్థలు పడుతున్నా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో స్వంత డబ్బులతో మరమ్మతులు చేయించానని తెలిపారు. గతంలో కూడా తాను డివిజన్‌లో కొన్ని చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు ఆయన గుర్తు చేశారు.

## ఉప్పల్‌లో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

ఉప్పల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిక్కుమళ్ల అంజయ్యగుప్త, పాలడుగు లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నేత మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణాష్టమి సందర్భంగా ఏటా అంగరంగ వైభవంగా ఉత్సవాలు చేయడం అభినందనీయమన్నారు. ఆర్యవైశ్యులు ఆనందోత్సవాలతో సంబరాలు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు బిక్కుమళ్ల అంజయ్యగుప్త, పి.లక్ష్మణ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి రామకృష్ణ, రాఘవేంద్రగుప్త తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ గణేష్ ఉత్సవ సమితి నూతన అధ్యక్షునిగా పసునూరి బిక్షపతిచారి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలోని మీర్‌పేట్ గణేష్ ఉత్సవ కమిటీ నూతన అధ్యక్షునిగా కార్పొరేషన్ 27వడివిజన్ బిజెపి కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి నియమితులయ్యారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి రావినూతల శశిధర్ ఆదేశాలమేరకు మహేశ్వరం నియోజకవర్గ కన్వీనర్ కీసర గోవర్ధన్‌రెడ్డి, కో-కన్వీనర్ కోదూరు సోమేశ్వర్ ఆధ్వర్యంలో మీర్‌పేట్ కమిటీని ఎన్నిక చేశారు. ఈ నేపథ్యంలో అధ్యక్షునిగా చారి, ప్రధానకార్యదర్శులుగా భీమ్‌రాజ్, జఠావత్ రవినాయక్, సప్పిడి జంగారెడ్డి, కోశాధికారిగా బచ్చనమోని కాశీరాం యాదవ్, ఉపాధ్యక్షులుగా పల్లె జంగయ్యగౌడ్, ఎనుగుల అనిల్ యాదవ్, కీసర హరినాథ్‌రెడ్డి, అబ్బనమోని గోపియాదవ్, నర్సింహయాదవ్, శ్రీనివాస్ గుప్త, మధు, గోపినాథ్, కార్యదర్శులుగా పరమేష్, దేవేందర్, వెంకటేష్, జగన్‌ముదిరాజ్, రాజేష్, శ్యాంసుందర్, తుమ్మల రమేష్, పోరెడ్డి సురేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా సుధాకర్, వేణుగోపాల్‌రెడ్డి, డి.మల్లికార్జున్, భాస్కర్, మహేష్‌యాదవ్, సురేష్, మురళిచారి, కార్తీక్‌సాగర్, గోపాల్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చారి మాట్లాడుతూ ఉత్సవాలను శాంతియుతంగా జరపాలని పిలుపునిచ్చారు.

## నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి : మంత్రి శ్రీనివాస్‌గౌడ్


నియామక ఉత్తర్వులను అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్‌పేటలోని మెరీడియన్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే బలాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల విభాగం సహకారంతో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మేళాలో సుమారు 60 కంపెనీలు పాల్గొంటున్నాయని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఎమ్మెల్యేలు జాబ్ మేళాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సిఎం కేసీఆర్ నేతత్వంలో మంత్రి కేటీఆర్ అనేక పరిశ్రమలు తీసుకురావడం జరిగిందని నగరాన్ని ఎంతో విస్తరింప చేశారన్నారు. ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్, అహ్మద్ బలాల పాత నగరంలో ఐటీ కంపెనీలు, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరడంతో వారు త్వరలో ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్న స్థితికి రావాలని ఆకాంక్షించారు. మలక్‌పేటలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ మలక్‌పేట్‌లోని యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడంకోసం జాబ్ మేళాలను ఏర్పాటు చేయడం జరిగిందని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వారు ఆఫర్ లెటర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సాలం షాహిద్, మీనాజుద్దీన్, నాయకులు, అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయునిగా మెగాసిటీ మూర్తి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: రంగారెడ్డి జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయునిగా బాలాపూర్ మండలం జిల్లెలగూడలోని మెగాసిటీ గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ కెవిఆర్ మూర్తి ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన గురు పూజోత్సవ వేడుకల సందర్భంగా ఆయన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, జైపాల్ యాదవ్‌ల చేతుల మీదుగా సన్మానం పొంది అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అవార్డు స్ఫూర్తితో విద్యార్థులు మరింతగా తీర్చిదిద్దుతామని మూర్తి స్పష్టం చేశారు.

## వడ్డెర్లకు భీమా సౌకర్యం కల్పించాలి

తుర్కయంజాల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : వడ్డెర వృత్తిదారులకు భీమా సౌకర్యం కల్పించాలని తుర్కయంజాల్ వడ్డెర సంఘం కార్యాలయంలో బుధవారం వడ్డెర వృత్తిదారులు ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వడ్డెర సంఘం అధ్యక్షులు నర్ర పాండు మాట్లాడుతూ వడ్డెర వృత్తి ప్రమాదకరమైందని, ఈ వృత్తి చేసేవారు అనేక మంది కాళ్లు,చేతులు విరిగి వికలాంగులుగా మారుతున్నారన్నారు. నేటి సమాజంలో వడ్డెర వృత్తిదారులు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వడ్డెర్లకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు, రేషన్ కార్డులు, ట్రాక్టర్లు, కంప్రెసర్ లోన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేబర్ కార్డులు ఉన్న ప్రతిఒక్కరికీ ట్రావెలర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయ్, నరేష్, మల్లేష్, కొండల్, యాదగిరి, మల్లేష్, నర్ర శ్రీధర్, ఒర్సు వెంకన్న, నరసింహ, వేముల వాసు, అభి, వరికుప్పల వెంకటేష్, నాగేష్ బోదాస్, వెంకటేష్, నందు, గండికోట భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ దంపతులకు ఘన సన్మానం


కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న కాలనీవాసులు

నేరెడ్‌మెట్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: నేరెడ్‌మెట్ డివిజన్‌ను అభివృద్ది పరుస్తానని కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని యాప్రాల్ మహాలక్ష్మీపురంకాలనీ వాసులు అభివృద్ది పనులపై ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ దంపతులను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అభివృద్ది పనులను పూర్తి చేసేందుకు కార్పొరేటర్ దంపతులు ఎంతో కృషి చేసారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, డిఇ మహేష్, ఏఇ సృజన, రమేష్, మోహన్, రాజేష్, రాజు, రఘుపతి, శ్యామ్, నవీన్, ఆర్తి, ప్రమీళ, విజయలక్ష్మి కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం

నేరెడ్‌మెట్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : 18సంలు నిండి, అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు కార్డులో తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా ప్రాజెక్టు మెనెజర్ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18సంలు నిండిన యువతీ, యువకులు ప్రతి ఒక్కరు తమ పేరును ఓటరు కార్డులో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శైలజ, డాక్టర్ జగన్, మల్లికార్జున్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు : చిలుక మధురఉపేందర్‌రెడ్డి


ఉపాధ్యాయురాలని సన్మానిస్తున్న చిలుక మధురఉపేందర్‌రెడ్డి దంపతులు

ఎల్.బి.నగర్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త: విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించేది ఉపాధ్యాయులే అని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక మధురఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డ్ అందుకున్న శేషమ్మని బుధవారం చిలుక మధురఉపేందర్‌రెడ్డి దంపతులు అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం ఒక్క ఉపాధ్యాయులకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు మహిపాల్‌రెడ్డి, నీక్యాత్, కవిత, లక్ష్మీకాంత్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ అసెంబ్లీ బిజెపి టికెట్‌ను ఎన్వీఎస్ఎస్‌కు కేటాయించాలి : చేతన


మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు టిక్కెట్ కేటాయించాలని వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ తదితరులు

ఉప్పల్, సెప్టెంబరు 5 ప్రభాతవార్త : ఉప్పల్ నియోజకవర్గం బిజెపి అసెంబ్లీ టిక్కెట్ మాజీఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు కేటాయించాలని హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కార్పొరేటర్ కక్కిరేణి చేతన ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఉప్పల్‌లో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఎంతో సేవ చేశారని, ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చింతోజు శ్రీనివాసాచారి, సీనియర్ నేతలు రవీందర్‌గౌడ్, సంజయ్‌పటేల్, వెంకటరమణ, వి.సోమశేఖర్‌గౌడ్, జి.రవీందర్‌రెడ్డి, చింతకింది ప్రవీణ్, సోమయ్య, వెంకన్నగౌడ్, శేఖర్, వెంకటయ్య, పాండు, సంగప్ప, శివ తదితరులు పాల్గొన్నారు.

## లార్డ్స్ పాఠశాలల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో విద్యార్థులు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త: జిల్లెలగూడ, బడంగ్‌పేట్‌లోని లార్డ్స్ హైస్కూళ్లలో బుధవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన శ్రీకృష్ణునికి సంబంధించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో డైరెక్టర్ శ్రీలత, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డివిజన్ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు : కార్పొరేటర్ రాజ్యలక్ష్మి..

నేరెడ్‌మెట్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఇటీవల డివిజన్ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్ లైన్ నెంబర్40లో గత కొన్ని సంవత్సరాలుగా రోడ్ మధ్యలో ఉన్న విద్యుత్ స్థంభాన్ని ఆమె సంబంధిత అధికారులతో కలసి చర్చించి తొలగించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యుత్ స్థంభం రోడ్డు మధ్యలో ఉండడం వల్ల వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులకు గరవుతున్నారని తెలిపారు. అట్టి సమస్య తన దృష్టికి రావడంతో వెంటనే సంబంధిత అధికారులతో కలసి చర్చించి పరిష్కరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీ ఉత్తమ్‌కుమార్‌ను కలిసిన శ్రీనివాస్


ఉత్తమ్‌కుమార్ రెడ్డికి అభినందలు తెలుపుతున్న ఎల్ఎల్‌బీ శ్రీనివాస్

తార్నాక, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త : ఇటీవల ఏఐసీసీఎలక్షన్ కమిటీ మెంబర్‌గా ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డిని అదిస్టానం నియమించిన సందర్భంగా సికింద్రాబాద్ లాలాపేట్‌కు చెందిన కాంగ్రెస్ పర్టీ బీసీ డిక్లరేషన్ మెంబర్ ఎల్ఎల్‌బీ శ్రీనివాస్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని ధీమ వ్యక్తం చేశారు.

## కనుల పండువగా ఎస్‌బిహెచ్ కాలనీలో పార్వతి పరమేశ్వరుల కళ్యాణమహోత్సవం


పూజలు నిర్వహిస్తున్న లింగాల హరిగౌడ్

సైదాబాద్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త: సైదాబాద్ డివిజన్ ఎస్‌బిహెచ్ కాలనీలోని పద్మావతి కళ్యాణ మండపంలో పులిమేటి మాధవి శ్రీహరి దంపతుల ఆధ్వర్యంలో పార్వతి పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణ మాస ంలో పార్వతి పరమేశ్వరుల కళ్యాణాన్ని నిర్వహించడం వలన అంతా మంచి జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతర ం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి, నవీన్ పటాలే తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కూడా మధ్యంతర భృతి ఇవ్వాలి : సిఐటియు

తుర్కయంజాల్, సెప్టెంబరు 6 ప్రభాతవార్త : మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్ డ్- పే తదితర సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలను కేటగిరీల వారిగా చెల్లించాలని, పర్మినెంట్ ఉద్యోగులకు చెల్లిస్తున్నట్లే కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వారికి కూడా ఐఆర్ (భృతి) ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రామ్‌రెడ్డి, కమిషనర్ శ్రీకాంత్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి డి.కిషన్ మాట్లాడుతూ పెరిగిన ధరలతో పోలిస్తే కార్మికులకు ఇస్తున్న వేతనం సరిపోవడంలేదని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్లుగా రూ. 21 వేలు వేతనం ఇవ్వాలనీ, కార్మికులందరినీ పర్మినెంట్ చేసి, ఐఆర్ (మధ్యంతర భృతి)ని పర్మినెంట్ ఉద్యోగులతోపాటు కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని యెడల సీఐటీయూ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30వ తేదీన కార్మికులతో కలిసి ఛలో హైదరాబాద్ నిర్వహించి రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెకు వెళ్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోసికే ఐలయ్య, వర్కర్స్ యూనియన్ నాయకులు మేతరి దాసు, శీలం నగేష్, నవీన్‌కుమార్, నక్కల్ల యాదగిరి, ఎంజె.ప్రకాష్ కారత్, కార్మిక నాయకులు పాల్గొన్నారు.